క్లుప్తంగా

ట్రిపుల్ ఐటీకి ఇద్దరి ఎంపిక


దవులూరి మేఘన వెంకటసత్య


తివారి ప్రియ

రామచంద్రపురం రూరల్: ట్రిపుల్ ఐటీ ఫలితాల్లో స్థానిక ప్రైవేట్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థినులు ఎంపికయ్యారు. తోటపేటకు చెందిన దవులూరి మేఘన వెంకటసత్య, తివారి ప్రియ ట్రిపుల్ ఐటీ శ్రీకాకుళం క్యాంపస్‌కు ఎంపిక కావడంపై పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

విద్యార్థులకు స్టూడెంట్ కిట్ల పంపిణీ


విద్యార్థులకు కిట్లను అందిస్తున్న ఉపాధ్యాయులు, నాయకులు

కాజులూరు: పలు ప్రభుత్వ పాఠశాలల్లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లను ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు గురువారం విద్యార్థులకు పంపిణీ చేశారు. కాజులూరు జెడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం మార్ని విష్ణుమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్థానిక నాయకుడు అన్యం శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ, స్టూడెంట్ కిట్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యా కమిటీ చైర్మన్ పెంటపాటి పద్దరాజు, ఎంపీటీసీ షేక్ బాలాజీ, ఉపాధ్యాయుడు చింతా సత్యనారాయణ, పీఏసీఎస్ మాజీ చైర్మన్ యాళ్ల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ


విద్యార్థులకు యూనిఫాం అందజేస్తున్న హెచ్ఎం అర్జునుడు, ఉపాధ్యాయులు

రాయవరం: మండలంలోని వెదురుపాక మోడల్ ప్రైమరీ పాఠశాల విద్యార్థులకు గురువారం యూనిఫాం పంపిణీ చేశారు. పాఠశాల హెచ్ఎం కన్నూరి అర్జునుడు ఆధ్వర్యంలో ఒకటవ తరగతి నుంచి ఐదవ తరగతి వరకు విద్యాభ్యాసం చేస్తున్న 51 మంది విద్యార్థులకు అందజేశారు. వచ్చే నెల మొదటి వారంలో జరగనున్న పేరెంట్, టీచర్స్ సమావేశానికి విద్యార్థులంతా యూనిఫాం ధరించే విధంగా తల్లిదండ్రులను మోటివేట్ చేయనున్నట్లు హెచ్ఎం అర్జునుడు తెలిపారు. ఇప్పటికే స్టూడెంట్ కిట్‌లో భాగంగా విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, డిక్షనరీలు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గుంటూరి అప్పారావు, రాయవరపు భాస్కరరావు, బొట్టా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం


బదిలీపై అయిన ఉపాధ్యాయులు నాగిరెడ్డి, రాంబాబును సత్కరిస్తున్న సర్పంచ్ రాంబాబు

రాయవరం: మండలంలోని లొల్ల ప్రాథమికోన్నత పాఠశాలలో విధులు నిర్వర్తించి, బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను గురువారం సత్కరించారు. పాఠశాల హెచ్ఎం శామ్యూల్ జోసెఫ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ చాట్రాతి జానకిరాంబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. హెచ్ఎంగా పని చేసిన కొవ్వూరి నాగిరెడ్డి, ఉపాధ్యాయుడు దండు రాంబాబు సేవలను ఈ సందర్భంగా సర్పంచ్ జానకిరాంబాబు ప్రశంసించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు పాతూరి అప్పారావు, రాంబాబు, గుండపునీడి వీర్రాజు, స్థానిక నేత సుంవవిల్లి గంగరాజు, ఉపాధ్యాయులు జోస్యుల రాధాకృష్ణవేణి, మల్లిడి చంద్రకళ, రమణారావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సై మృతికి ఎమ్మెల్సీ సంతాపం

కపిలేశ్వరపురం (మండపేట): రోడ్డు ప్రమాదంలో ఆలమూరు ఎస్సై ఎం.అశోక్ మృతి చెందడం బాధాకరమని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు విచారం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోవడం తీవ్రంగా కలచివేసిందన్నారు. మండపేట తదితర ప్రాంతాల్లో అశోక్ ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవతో కృషి చేశారన్నారు. ఎస్సై అశోక్ మృతికి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి తదితరులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

అప్రమత్తతే శ్రీరామరక్ష

- నారుమళ్ల నిర్వహణలో జాగ్రత్తలు అవసరం
- అధిక వర్షాలపై ఆందోళన వద్దు
- సంరక్షణకు వ్యవసాయాధికారుల కీలక సూచనలు


రైతులు సిద్ధం చేసిన వరి నారుమడి

రాయవరం: అధిక వర్షాల సమయంలో నారుమళ్ల సంరక్షణలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని మండల వ్యవసాయాధికారి కేవీఎస్ రమేష్‌కుమార్ తెలిపారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున నారుమడుల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. రైతులు వరి పంట సాగు చేసుకునే క్రమంలో కొందరు ఊడ్పుల విధానంలో, మరికొందరు వెదజల్లు సాగును చేపడుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు, చలిగాలులతో కూడిన చిరుజల్లులు, తక్కువ ఉష్ణోగ్రతల నమోదు, అధిక తేమ శాతం ఉన్న పరిస్థితుల్లో వరి నారుమడి దశలో తెగుళ్లు అధికంగా ఆశించే అవకాశం ఉందన్నారు. వ్యవసాయాధికారుల సూచనలు పాటించడం ద్వారా ఆరోగ్యవంతమైన వరి నారుమడులను తయారు చేసి, ఆరోగ్యవంతమైన నారును పెంచవచ్చన్నారు.

నారుమడులు ఇలా..

- వరి నారుమడిని మూడు విడతలుగా దమ్ము చేసి చదును చేయాలి, కొంచెం ఎత్తుగా, నారుమడిలో నీరు నిల్వ ఉండకుండా ఉండేలా, నీరు పెట్టడానికి, తీయడానికి వీలుగా కాలువలు ఏర్పాటు చేసుకోవాలి.
- ఐదు సెంట్ల వరి నారుమడికి పశువుల పెంటతో పాటు, 6 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, రెండు కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసి నారుమడి పొలాన్ని తయారు చేసుకోవాలి.
- నారుమడిలో విత్తనం చల్లే ముందు శిలీంద్ర నాశిని కార్బెండజిమ్ 3 గ్రా. లేదా సూడోమోనాస్ ఫ్లోరెసెన్స్ 8 గ్రా. మందును కిలో విత్తనానికి పట్టించి, విత్తన శుద్ధి చేసి నారుమడిలో చల్లాలి.
- ప్రతి 5 సెంట్ల నారుమడికి, విత్తనం చల్లే ముందు 2 కిలోల యూరియా, విత్తనం చల్లిన 7–10 రోజులకు మరో 2 కిలోల యూరియా వేయాలి.
- అలాగే అధిక వర్షాల వల్ల నీట మునిగిన వరి నారుమడిలో ఎక్కువగా నిల్వ ఉన్న నీటిని వీలైనంత త్వరగా బయటకు తీసి వేసి, 5 సెంట్ల నారుమడికి 2 కిలోల యూరియా, 4 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేయాలి.
- అధిక వర్షాల వల్ల వరి నారుమడి దశలో ఉన్న స్వర్ణ, ఎంటీయూ–7029 వంటి రకాల్లో పొడతెగులు ఆశించే అవకాశముంది. దీని నివారణకు పొలంలో నిలబడి ఉన్న నీటిని తీసిన వెంటనే ప్రొపికోనజోల్ 1 మి.లీ. లేదా హెక్సాకోనజోల్ 2 మి.లీ.ను లీటరు నీటికి చొప్పున నారుమడిపై పిచికారీ చేయాలి.

తెగుళ్లకు అవకాశం

నారుమడి దశలో లేదా నాటిన కొద్ది రోజుల తర్వాత గాలితో కూడిన వర్షాలు పడుతున్నప్పుడు, వర్షాలు ఎడతెరిపి లేకుండా ఎక్కువ రోజులు కురిసినప్పుడు, ఉష్ణోగ్రత 22–26 డిగ్రీలు ఉంటూ మొక్కల సాంద్రత ఎక్కువగా ఉన్నప్పుడు, నత్రజని ఎరువులు ఎక్కువగా వాడినప్పుడు, నీడ సోకే ప్రాంతాల్లో బ్యాక్టీరియా ఎండాకు తెగులు వ్యాధి తీవ్రతను పెంచుతాయి. ఎంటీయూ–1318, ఎంటీయూ–1121 రకాల్లో ఎండాకు తెగులు వచ్చే అవకాశం ఉంది. ఈ తెగులు సోకితే ఆకు చివర్ల నుంచి కింద వరకు రెండు వైపులా తడిసినట్లు ఉండి, పసుపు రంగుకు మారి ఆకులు ఎండి, మొక్కలు చనిపోతాయి. దీనినే క్రెసెక్ దశ ఎండాకు తెగులు అంటారు. ఈ తెగులు నారుమడి దశలోనూ, నాటిన తొలి దశలోనూ వస్తుంది.

క్లస్టర్‌లో పరిస్థితి

మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలోని రాయవరం, కపిలేశ్వరపురం, మండపేట, కె.గంగవరం, రామచంద్రపురం, కాజులూరు మండలాల పరిధిలో 1.01 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ వరినాట్లు చేపడుతున్నారు. క్లస్టర్ పరిధిలో వరినాట్లు ఊపందుకున్నాయి. 60 వేల ఎకరాల్లో ఊడ్పులు, 40 వేల ఎకరాల్లో వెదజల్లు విధానంలో సాగు చేపడుతున్నారు. వరినాట్లు వేసేందుకు క్లస్టర్ పరిధిలో మూడు వేల ఎకరాల్లో వరి నారుమడులను సిద్ధం చేసుకోవాల్సి ఉండగా, ఈ నెలాఖరు నాటికి పూర్తి స్థాయిలో వరినాట్లు వేయనున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

చేపట్టాల్సిన చర్యలు

ఎండాకు తెగులు ఆశిస్తే, నత్రజని ఎరువులు తాత్కాలికంగా నిలిపివేయాలి. తెగులు సోకిన పొలంలో నుంచి నీటిని మురుగు కాలువల ద్వారా బయటకు పంపాలి. కొత్త నీరు మొక్కలకు అందించాలి. ఈ తెగులు గమనించిన వెంటనే ప్లాంటామైసిన్ ఒక గ్రాముతో పాటు, కాపర్ హైడ్రాక్సైడ్ 2 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

- నారుమడిలో కలుపు మొక్కలు లేకుండా నివారణ చేయాలి.
- విత్తిన 10–15 రోజుల తర్వాత, నారుమడిలో ఆశించే పురుగుల నివారణకు (కాండం తొలుచు పురుగు, ఉల్లి కోడు) కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు సెంటు నారుమడికి 160 గ్రాముల చొప్పున రెండింతల ఇసుకతో కలిపి చల్లి, తేలిక పాటి తడి ఇవ్వాలి.

గ్రామాల అభివృద్ధికి కృషి


సీసీ రోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి

కాజులూరు: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. గురువారం కాజులూరులో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. గ్రామంలో ఉపాధి హామీ నిధులు రూ.11.80 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును, శ్రీరామ్‌నగర్ కాలనీలో రూ.19 లక్షలతో నిర్మించిన నాలుగు సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని డ్రైనేజీ వ్యవస్థపై పలువురు స్థానికులు మంత్రికి ఫిర్యాదులు చేశారు. సర్పంచ్ దండంగి సరోజిని, తహసీల్దార్ రవీంద్రనాథ్ ఠాగూర్, ఎంపీడీఓ జె.రాంబాబు, పీఆర్ జేఈ శేఖర్, మాజీ ఎంపీపీ యాళ్ల కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

కాలు పెడితే.. కూరుకుపోద్ది..


వర్షాలకు బురదగా మారిన మొగలిపాలెం–కొత్తకాలనీ రహదారి

కాజులూరు: మండలంలోని మొగలిపాలెం–కొత్త కాలనీ రహదారి అధ్వానంగా మారింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు బురదమయంగా మారింది. దీంతో ఇంటి నుంచి బయటకు రావాలంటే ఇబ్బందిగా ఉంటోందని కాలనీవాసులు వాపోతున్నారు. పుష్కర కాలం క్రితం ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.10 లక్షల వ్యయంతో ఈ రహదారిపై మెటల్ రోడ్ నిర్మించారు. నాటి నుంచి మరమ్మతులకు గురైనా పట్టించుకోకపోవటంతో ప్రస్తుత వర్షాలకు బురదమయంగా మారిందని చెబుతున్నారు. కనీసం సైకిళ్లు, మోటార్ సైకిళ్లు ప్రయాణించేందుకు వీల్లేకపోవడంతో.. కాలినడకన గ్రామంలోకి వెళుతున్నామని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

మొహర్రం మాసం ప్రారంభం


ద్రాక్షారామలో సిద్ధం చేసిన పీర్ల పంజాలు

రామచంద్రపురం రూరల్: చంద్ర దర్శనంతో ద్రాక్షారామలో ముస్లిం భక్తులు మొహర్రం సంతాప దినాలను గురువారం భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. ద్రాక్షారామ పరిసరాల్లోని 20 పంజాలను ధర్మకర్తలు సిద్ధం చేశారు. ముస్లింలు అధికంగా నివసించే ద్రాక్షారామలో ఆగా వారి పంజా, హజరత్ అబ్బాస్ పంజా, పంజాదానీ పంజా, ఇమామ్ రజా పంజా, ఆజా ఖానీ జహరా పంజా, అల్ అబ్బాస్ అల్ హుస్సేన్ పంజా, బీబీ సకీనా పంజా, అర్షైన్ పంజా, జన్నతుల్ బఖీ పంజా, అలీ అక్బర్ పంజా, మౌలాలీ పంజా, ఇమామ్ పంజా తదితర పంజాల్లో ఆదివారం రాత్రి నెల వంకను చూసి మొహర్రం సంతాప దినాలుగా పరిగణించి ప్రారంభించారు. ఆగా వారి పంజా నుంచి పీరును వెలంపాలెం, ద్రాక్షారామ వీధుల్లో ఊరేగించి ఇమామ్ అలిరజా పంజాలో ప్రతిష్ఠించారు. పంజాను పూలతో అలంకరించి ఫాతెహా ఇచ్చారు. మొహర్రం సంతాప దినాల్లో తాజియా (గుండెలపై బాదుకోవడం), ఆలం(పీరు) ఊరేగించడం, సంతాప దినాల్లో ప్రధాన తేదీలైన జూలై 1, 2, 4, 5 రోజుల్లో గుండాల(నిప్పు కణికలు)పై నడవడం ప్రధానంగా ఆచరిస్తారు. మొహర్రం సంతాప దినాల్లో మజ్లిస్‌లు ఆలపించడానికి, ప్రార్థనలు చేయడానికి లక్నో(ఫైజాబాద్) నుంచి మత గురువు మౌలానా మొహమ్మద్ షంసీ హాజరయ్యారు.

మొదలైన సంతాప దినాలు


అంగర పీర్ల పంజాలో ప్రార్థన చేస్తున్న ముస్లింలు

కపిలేశ్వరపురం: మహా ప్రవక్త మొహమ్మద్ (సఅవ) మనుమలు హుస్సేన్, హుస్సేన్ త్యాగాలను స్మరించుకుంటూ నెల రోజులు పాటు నిర్వహించే మొహర్రం సంతాప దినాలు గురువారం ప్రారంభమయ్యాయి. అంగరలోని పీర్ల పంజాలో షేక్ వలీ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇస్లాం క్యాలెండర్ ఆధారంగా గురువారం నుంచి జూలై ఆరు వరకూ పది రోజుల పాటు సంతాప దినాలుగా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సమీప గ్రామాల ముస్లింలు పాల్గొన్నారు.

యోగాతో అనేక సత్ఫలితాలు


యోగాపై శిక్షణ ఇస్తున్న డాక్టర్ రాధాకుమారి

కపిలేశ్వరపురం (మండపేట): మానసిక, శారీరక ఆరోగ్యంతో పాటు యోగా సాధనతో అనేక ఇతర సత్ఫలితాలు సాధించవచ్చని మండపేట పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకుమారి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని చైర్‌పర్సన్ చాంబర్‌లో గురువారం ధ్యానంపై అవగాహన కల్పించారు. ఆధునిక మానవులను ఆశిస్తున్న 99 శాతం రుగ్మతలు మానసిక ఒత్తిళ్ల కారణంగా వస్తున్నాయన్నారు. మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవడం ద్వారా రుగ్మతలు దాదాపు దూరమవుతాయని వివరించారు. ముఖ్య అతిథి చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి మాట్లాడుతూ, రోజువారీ జీవితంలో యోగా ఓ సాధనా భాగంగా మార్చుకోవాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎర్నేన ప్రభావతి, శెట్టి కల్యాణి, నీలం దుర్గ, మెప్మా టీఎంసీ సుజాత, రీసోర్స్‌పర్సన్లు పాల్గొన్నారు.

పశువుల దాణా పంపిణీ


రైతులకు దాణాను అందిస్తున్న ఏడీ తదితరులు

కె.గంగవరం: పాడి రైతులకు అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని రామచంద్రపురం పశు సంవర్ధన శాఖ ఏడీ రామకృష్ణ అన్నారు. కె.గంగవరం, పామర్రు పశువైద్యశాలల వద్ద గురువారం పాడి రైతులకు సబ్సిడీపై పశువుల దాణాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పశువులకు వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉంటూ, సమస్య వస్తే పశు వైద్యులను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆత్మ మాజీ చైర్మన్ దొరబాబు, పాడి రైతులు, పశు వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఉచితంగా పుస్తకాల పంపిణీ


పుస్తకాలు అందుకున్న విద్యార్థులతో దాతలు, ఉపాధ్యాయులు

కె.గంగవరం: మండల కేంద్రమైన కె.గంగవరంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం దాతలు ఉచితంగా నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. హైదరాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ముత్యాలు కిషోర్, సుధ మెయిన్ స్కూల్‌లోని విద్యార్థులకు వీటిని అందజేశారు. హెచ్ఎం పోతంశెట్టి సత్యనారాయణమూర్తి దాతలను అభినందించారు. ఎస్ఎస్ఏ ఐఈ జిల్లా కో–ఆర్డినేటర్ మర్రిరెడ్డి వీరవెంకట సత్యనారాయణ, ఉపాధ్యాయులు దాసరి శ్రీను, ఎం ప్రదీప్‌కుమార్, ఎన్ శ్యామలాదేవి, కె.శిరీష తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్, లిక్కర్‌తో యువత భవిష్యత్తుకు ఆటంకం


ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, యువత

– మంత్రి సుభాష్

రామచంద్రపురం: యువతలో డ్రగ్స్ వినియోగం, లిక్కర్ వినియోగం వంటివి ఎక్కువయ్యాయని, వారి బంగారు భవిష్యత్తుకు ఆటంకం కలిగించే ఇలాంటి వ్యసనాలపై విద్యార్థులకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అవగాహన కల్పించాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా పట్టణంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అవగాహన ర్యాలీని మంత్రి ప్రారంభించారు. తొలుత విద్యార్థులు, యువతతో ప్రతిజ్ఞ చేయించారు. మంత్రి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ మాదకద్రవ్యాలు లేని సమాజానికి కృషి చేయాలని అన్నారు. కుటుంబ వ్యవస్థను చిన్నాభిన్నం చేసే మాదకద్రవ్యాలతో విద్యార్థులు, యువత, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రాష్ట్రంలో మాదకద్రవ్యాలను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రత్యేక మంత్రుల కమిటీ నిత్యం పర్యవేక్షణ చేస్తుందని, డ్రోన్లు, జీపీఎస్ ట్రాకింగ్, బ్లాక్ చైన్ టెక్నాలజీ ఆధారిత సీసీ టీవీలు, సాంకేతిక పరిజ్ఞానంతో చర్యలు చేపడుతుందన్నారు. మాదకద్రవ్యాలు తీసుకోవడం, మద్యపానం సేవించి డ్రైవింగ్ చేయడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి, ఎన్నో కుటుంబాలు కష్టాల పాలవుతున్నాయన్నారు. ఆర్డీవో కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ మెయిన్ రోడ్డు మీదుగా రాజగోపాల్ సెంటర్‌కు చేరకుంది. అక్కడ మానవహారంగా ఏర్పడి, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు, సీఐ వెంకటనారాయణ, ఎస్సైలు నాగేశ్వరరావు, లక్ష్మణ్, భుజంగరావు, ఎక్సైజ్ అధికారులు, పలువురు నాయకులు, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు తాగునీటి సరఫరా నిలుపుదల

రామచంద్రపురం: వెల్ల హెడ్ వర్క్స్‌లో లిఫ్ట్ పంపు హౌస్ వద్ద ప్రైమింగ్ వ్యాక్యూమ్ మోటార్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం తాగునీటి సరఫరాను ఉదయం, సాయంత్రం నిలుపుదల చేస్తున్నట్టు కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నీటి సరఫరా నిలుపుదల కారణంగా పట్టణ ప్రజలు తాగునీటిని పొదుపుగా వాడుకోవాలని విజ్ఞప్తి చేశారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రాయవరం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుంది. ఈ మేరకు ఏపీఈపీడీసీఎల్ రాయవరం ఈఈ కె.రత్నాలరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రాయవరం సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా 11 కేవీఏ అన్ని ఫీడర్లలో అంతరాయం ఏర్పడనుందని తెలిపారు. రాయవరం, వి.సావరం, వెదురుపాక, నదురుబాద, అనపర్తి మండలంలోని మహేంద్రవాడ, బిక్కవోలు మండలంలోని కొమరిపాలెం, తొస్సిపూడి గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఆయన పేర్కొన్నారు.

రామచంద్రపురం: పట్టణంలోని శీలంవారిసావరం 33 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ రామచంద్రపురం డీఈఈ కె.రత్నాలరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజగోపాల్ సెంటర్, వైఎస్సార్ నగర్, శీలంవారిసావరం, బ్రాడీపేట, సాయినగర్, ద్రాక్షారామ రోడ్డు, బీర్ ఫ్యాక్టరీ, ఆర్వోస్ వాటర్ వర్క్స్ రైలు గట్టు, రామకృష్ణనగర్, తోరంవారి వీధి, కేవీ రామలింగేశ్వర ఇండస్ట్రియల్, చోడవరం, నరసరావుపేట, ఓదూరు, యనమదల, ఆక్వా సర్వీసెస్ ఇండస్ట్రీస్ గ్యాస్, గెయిల్ ప్రాంతాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అంతరాయం కలుగుతుందని వివరించారు.

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ కాలేరు ఫీడర్ పరిధిలోని నల్లూరు, కాలేరు, అచ్యుతాపురం, వడ్లమూరు, నిరసనమెట్ట, సుభద్రాపురం గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్టు రామచంద్రపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రత్నాలరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలు వరకూ సబ్‌స్టేషన్‌లో నిర్వహించతలపెట్టిన ఆర్‌డీఎస్ఎస్ పనుల నేపథ్యంలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు పేర్కొన్నారు.

మండపేటలో...

పట్టణంలోని ఏడిద రహదారిలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు తెలిపారు. బైపాస్ రోడ్డు, ఏడిద రోడ్డు, రాజీవ్ గృహకల్ప కాలనీ, సంగం కాలనీ, విజయలక్ష్మి నగర్, మెహర్ ఆశ్రమం, సత్యశ్రీ రోడ్డు, మెయిన్‌రోడ్డు, బస్‌స్టాండ్ రోడ్డు, తర్వాణీపేట, సెంటెన్స్ స్కూల్ ఏరియా, పెద్దకాలువ వంతెన, వీరభద్రపురం, బ్యాంకు కాలనీ, శ్రీలక్ష్మి నగర్ ప్రాంతాల్లో విద్యుత్ విద్యుత్ లైన్ల మరమ్మతు పనుల నిమిత్తం సరఫరాను నిలిపివేయనున్నామన్నారు. కావున వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

రేపు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

రామచంద్రపురం: పట్టణ పురపాలక సంఘ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో శనివారం సాధారణ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, కో–ఆప్షన్ మెంబర్లు, అధికారులు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

నేడు మండల పరిషత్ సమావేశం

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం 2.30కు సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ కడలి పద్మజ్యోతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని జెడ్పీటీసీ, ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల మండల అధికారులు హాజరు కావాలని కోరారు.

అమలాపురానికి బస్సు సౌకర్యం కల్పించాలి

కాజులూరు: మండలంలోని వివిధ గ్రామాల నుంచి జిల్లా కేంద్రమైన అమలాపురానికి బస్సు సౌకర్యం కల్పించాలి పలువురు డిమాండ్ చేస్తున్నారు. గురువారం చేదువాడలో డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ పెంకే సత్యనారాయణ, గంజా సూరిబాబు, కురుపూడి నాగేశ్వరరావు తదితరులు మాట్లాడుతూ, తాళ్లరేవు, యానాం మీదుగా కాకినాడ డిపో నుంచి సుమారు 15 బస్సులు నిత్యం అమలాపురం ప్రయాణిస్తున్నాయని చెప్పారు. వీటిలో కాకినాడ నుంచి రెండు బస్సులను గొల్లపాలెం, కాజులూరు మీదుగా అమలాపురం నడపాలని కొన్నేళ్లుగా అధికారులకు వినతిపత్రాలు సమర్పిస్తున్నా ఎవ్వరూ పట్టించుకోవటం లేదన్నారు. ఈ సర్వీసు ద్వారా మండలంలోని వివిధ గ్రామాల ప్రజలకు ప్రయోజనం చేకూరడంతో పాటు, ఆర్టీసీకి మంచి ఆదాయం వస్తుందన్నారు. అధికారులు దీనిపై దృష్టి పెట్టి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

మాదకద్రవ్యాలకు బానిసలు కావొద్దు

కపిలేశ్వరపురం (మండపేట): ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలకు బానిసలు కావొద్దని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మండపేట పట్టణంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గురువారం మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ ర్యాలీలో ప్రజాప్రతినిధులు, పట్టణ సీఐ డి.సురేష్ మాట్లాడారు. సమాజంలో యువత చెడు ప్రభావాలకు దూరంగా ఉండేలా ఎప్పటికప్పుడు చైతన్యంతో వ్యవహరించాలన్నారు. చెడు వ్యసనాలకు అలవాటు పడితే, మొత్తం కుటుంబాన్ని, సమాజాన్ని ప్రమాదంలో నెట్టే పరిస్థితులకు వెళతారని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్సై జి.చంటి, మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ పాల్గొన్నారు.